క్లుప్తంగా

26న వసంత పంచమి


అమ్మవారి దర్శనం

నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సమేత సరస్వతి ఆలయంలో ఈనెల 26న వసంత పంచమిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణ అధికారి జయంతి తెలిపారు. భక్తులు కోవిడ్‌-19 నిబంధనలు పాటిస్తూ అమ్మవారిని దర్శించుకోవాలని ఆమె వివరించారు.

చారిటీ ఆసుపత్రికి విరాళం



ముషీరాబాద్: పేదలకు రూపాయికే కార్పొరేట్ ఓపీ సేవలను అందిస్తున్న జీజీ చారిటీ ఆసుపత్రి చైర్మన్ దారా గంగాధర్‌గుప్తాను 'ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్' సభ్యులు ఘనంగా సన్మానించి రూ. 91వేల చెక్కును అందజేశారు. ఈ వైద్య సేవలకు అండగా ప్రతి ఏటా రూ. లక్ష వరకు అసోసియేషన్ అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ.. ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా ఓపీ సేవలతో వంద క్లీనిక్‌లను ఏర్పాటు చేసేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. అధ్యక్షులు ఆర్. నమశివాయ, ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, కోశాధికారి బద్రినాథ్ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు



ముషీరాబాద్: భోగి పండుగ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ రాంనగర్ డివిజన్ జెమినీకాలనీలోని పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు రాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

అభినందన



ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర మొదటి మహిళా చీఫ్ సెక్రటరీగా నియమితులైన శాంతికుమారిని శనివారం సీనియర్ సోషల్ వర్కర్, పబ్లిక్ ఎఫైర్స్ కన్సల్టెంట్ కంచిరాజు కాశినాథ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె సారథ్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

22 నుంచి బాడ్మింటన్ టోర్నీ

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17వ, ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌-2023ను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర‌రెడ్డి, కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు దేవిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పురుషుల డబుల్స్‌లో 19 ప్లస్, 35 ప్లస్, 45 ప్లస్ ఏజ్ గ్రూప్ బాడ్మింటన్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీలోని జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్స్‌లో ఈ నెల 22 నుంచి 25 వరకు ఉదయం 5.30 నుంచి 9 గంటల వరకు టోర్నమెంట్ కొనసాగుతుందన్నారు. ఆసక్తి కలిగిన ఆటగాళ్లు ఈ నెల 19 తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు. వివరాలకు ఫోన్: 98663 31280లో సంప్రదించవచ్చన్నారు.

శాలివాహన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా రఘునందన్‌రెడ్డి



మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ శాలివాహన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా చెల్లూర రఘునందన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ నడకలో భాగస్వాములుగా చేస్తామన్నారు. నడక వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరిస్తామన్నారు. క్లబ్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు చేపడతామని ఆయన వెల్లడించారు. తనకు బాధ్యతలు అప్పగించిన వాకర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు.

భోగి కాంతితో.. సంక్రాంతికి స్వాగతం

కొలువుదీరిన రంగవల్లులు ● పతంగులు ఎగురవేస్తూ యువకుల సందడి


భోగి మంటలు వేస్తున్న దృశ్యం


పిండి వంటల దుకాణం వద్ద ..

ముషీరాబాద్: ఇంటి ముందు రంగవల్లులు, కొత్త బట్టలు, డూడూ బసవన్నల విన్యాసాల నడుమ సంక్రాంతిని ప్రజలు సందడిగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామునే పలు కాలనీలలో భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. పిండి వంటల దుకాణాలు, పతంగుల కోసం వినియోగదారులు కిక్కిరిసిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నా, పెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేస్తూ ఆనందంతో వారు గడిపారు.

ప్రత్యేక పూజలతో ..

నల్లకుంట: అంబర్‌పేట నియోజక వర్గంలోని ప్రజలు వేకువజాముననే నిద్రలేచి భోగి మంటలతో సందడి చేశారు. శనివారం ఇళ్ల ముంగిళ్లను ముగ్గులతో అలంకరించి ఆవు పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను పేర్చారు. చిన్నారులకు భోగి పళ్లను పోశారు. ఇంటిల్లిపాది తలంటు స్నానాలు చేసి ఆలయాలకు వెళ్లి వారి ఇష్ట దైవాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- నల్లకుంటలోని శంకరమఠం, పాత రామాలయం, న్యూ రామాలయం, కుసుమహరనాథ ఆశ్రమం, సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం ఇళ్లల్లో బొమ్మల కొలువులను ఏర్పాటు చేశారు.

ముగ్గుల పోటీలు ..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కులో మహిళలకు ముగ్గుల పోటీని నిర్వహించారు.

- అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. క్లబ్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు పాండయ్య, దామోదర్‌రెడ్డి, నాగభూషణం, బబ్లూ, హౌస్‌ఫెడ్ డైరెక్టర్లు కిషన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి, శంకర్ గంగపుత్ర, ప్రవీణ్‌గౌడ్, కృష్ణ, పద్మ, అనుపమరెడ్డి తదితరులున్నారు.


శ్రీ కృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

బస్తీ పిల్లలకు పతంగుల పంపిణీ



చిక్కడపల్లి: మకరసంక్రాంతి పండుగను పురస్కరించుకుని గాంధీనగర్ డివిజన్‌లోని అన్నానగర్ బస్తీలో పిల్లలకు పంతంగులను ఉచితంగా పంపిణీ చేశారు. శనివారం బీజేవైఎం నగర పూర్వ అధ్యక్షులు వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. సంతోషకరమైన వాతావరణంలో పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పండుగను నిర్వహించుకోవాలన్నారు. పండగ సందర్భంగా డివిజన్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు సురేష్ (సూరి), రహమత్ అలీ, ఆనంద్‌రావు, డేవిడ్, ప్రశాంత్, సతీష్, సంధ్యరాణి, పూర్ణ, బస్తీవాసులు లక్ష్మి, యాకయ్య, నర్సింహ తదితరులున్నారు.


ముషీరాబాద్, రాంనగర్‌లో దుకాణాల వద్ద యువకుల సందడి


సుందరయ్యపార్కులో ముగ్గుల పోటీలు నిర్వహించిన వాకర్స్ సభ్యులు

ప్రారంభమైన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో కొలువుదీరిన మల్లన్నస్వామి


కాంగ్రెస్ మాజీ ఎంపీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్ బాకారంలోని బ్రమరాంభమల్లికార్జునస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు జరిగే మల్లన్న జాతర బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు అంజిరెడ్డి, ఊర్మిలాఅంజిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి జ్యోతిల నేతృత్వంలో ఆలయ పూజారి మధుసూదనశర్మ, ఒగ్గు పూజారులు సీతారామశర్మ, బాబుయాదవ్‌ల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ, స్వామివారికి పాలువట్టుట, స్వామి వారికి ఎదుర్కోలు చేపట్టారు. మాజీ రాజ్యసభ సభ్యుడు, హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు అభిషేక్‌రెడ్డి, జీఎస్ కేశవ్, జనార్దన్‌రెడ్డి, గుర్రంశంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదాలపై ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి


ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

అంబర్‌పేట: రోడ్డు భద్రతపై ఆర్టీసీ డ్రైవర్లు ప్రత్యేక అవగహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం బర్కత్‌పురా ఆర్టీసీ బస్‌డీపో వద్ద డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన నిర్వహించారు. బస్సు డ్రైవర్లు జీరో రోడ్డు ప్రమాదాలు ఉండేలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే రాకపోకలతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఆర్టీసీ డీపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ నమ్రత, ట్రాఫిక్ ఎస్ఐ గంగాధర్, ఏఎస్ఐ లక్ష్మణ్‌రావు, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధరావత్ నానునాయక్ అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఎస్ఐలు పెంటాగౌడ్, యాదగిరి, ఏఎస్ఐ సూర్య తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా గోదాదేవి కల్యాణం


కల్యాణోత్సవంలో ముఠా జైసింహ తదితరులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ చైర్మన్‌రవియాదవ్, ధర్మకర్తలు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ దోమలగూడ హనుమాన్ దేవాలయంలో భోగి సందర్భంగా గోదాదేవి కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి టీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, దోమలగూడ ఆలయ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్‌లు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు మహేందర్, వేణుగోపాల్, శేఖర్, సంతోష్, నాయకులు శ్రీను, శ్యామ్‌యాదవ్, శ్రీకాంత్, విజయ్ ఆలయ ఈఓ దేవనాథం, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అడిక్‌మెట్‌లో..

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా జరిగింది. శనివారం అమ్మవారికి పుష్పార్చన, సుప్రభాతసేవ చేశారు. కల్యాణం అనంతరం రాంనగర్ వీధుల్లో ఊరేగింపు నిర్వహించగా.. ఉత్సవానికి ముఠా జైసింహా, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్, అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ సునితా ప్రకాష్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ తదితరులు హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ రవియాదవ్, ధర్మకర్తలు శ్రీనివాస్, గోవర్దన్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, జయరజిని, గోవర్దన్‌రెడ్డి, ఆనంద్‌ముదిరాజ్, టీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేందర్ తదితరులున్నారు.

'ఎమ్మెల్యేను విమర్శించే నైతిక హక్కు లేదు'


మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ గాంధీనగర్ డివిజన్ రాకేష్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌కు ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని బీఆర్ఎస్ పార్టీ గాంధీనగర్ డివిజన్ రాకేష్‌కుమార్ విమర్శించారు. శనివారం గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక పార్టీ నేతలు ముఠానరేష్, శ్రీనివాస్‌గుప్తా, నరసింగరావు, శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యేను రాజీనామా చేయాలని డిమాండ్ చేసే బదులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో రాజీనామా చేయించాలని అప్పుడు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎక్కువ నిధులు మంజూరు చేయించాలని సూచించారు. రూ.425 కోట్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, రూ.90 కోట్లతో హుస్సేన్‌సాగర్ రిటైనింగ్ వాల్ పనులు కూడా చరుగ్గా జరుగుతున్నాయని ఇలాంటి విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు.

కరపత్రం ఆవిష్కరణ

ముస్సారాబాద్: ఇందిరాపార్కు వద్ద ఫిబ్రవరి 14న జరిగే దండోరా మహాధర్నా కరపత్రాన్ని ఎంఆర్‌పీఎస్ టీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు ద్యావని నర్సింహా ఆధ్వర్యంలో శనివారం ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఆవిష్కరించారు. నర్సింహా మాట్లాడుతూ... దళితబంధు పథకంలో నిరుపేద దళితులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌ల పిలుపుమేరకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆకారపు రుక్కమ్మ మాదిగ, జీడీ నర్సింహ మాదిగ, ఈరసాని సుగుణమ్మ మాదిగ, సంగపాయ ఏసోఫ్ మాదిగ, మంద జయన్న మాదిగ, వేముల సూర్యప్రకాష్, రామస్వామి, జలంధర్, లక్ష్మయ్య, శశి, నాగరాజు, వీరమల్ల వెంకన్న, మల్లేష్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

జంతుశాస్త్రంలో రాణికి డాక్టరేట్


పట్టా అందుకుంటున్న డాక్టర్ రాణి


పి.అవినాష్ గోయల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జంతు శాస్త్రం విభాగంలో ఎస్.రాణికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.ఏవీ రాజశేఖర్ పర్యవేక్షణలో ఎకోలజికల్ స్టడీస్ ఆఫ్ కొటపల్లి లేక్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ మెటల్స్ ఆన్ ప్లాన్క్‌టానిక్ డైవర్సిటీ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు చెప్పారు.వికారాబాద్ జిల్లాకు చెందిన రాణి మహాత్మాజ్యోతిరావు పూలే పాఠశాలల్లో టీచర్ ఉద్యోగం చేస్తున్నారు. తన పరిశోధనకు సహకరించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అవినాష్ గోయల్‌కూ..

ఓయూ ఎంబీఏ విభాగం విద్యార్థి పి.అవినాష్ గోయల్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీనియర్ అధ్యాపకులు ప్రొ.వెంకటయ్య పర్యవేక్షణలో రిక్రూట్‌మెంట్ ప్రాక్టిసెస్ అండ్ సెలక్షన్ ఆఫ్ ఎంప్లాయీస్ ఇన్ ఐటీ ఇండస్ట్రీ-ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ కంపెనీస్ ఇన్ హైదరాబాద్ అనే అంశం పై పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించిన్నట్లు తెలిపారు.

రూ.3 కోట్లతో ఏ,బీ హాస్టళ్లకు మరమ్మతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో మూతబడిన పాత హాస్టల్ భవనాలకు మరమ్మతులు పనులు ప్రారంభించనున్నారు. నాలుగేళ్ల క్రితం మూసివేసిన గోదావరి హాస్టల్ (ఏ-హాస్టల్), గత ఏడాదిగా మూతబడిన భగిరథ హాస్టల్(బీ-హాస్టల్) భవనాలను సుమారు రూ.3 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపటి విద్యుత్తు కోసం సోలార్‌షీట్లను అమర్చనున్నట్లు అధికారులు తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్ సైన్స్ కాలేజీ గణితశాస్త్రం విభాగం ఎదుట నున్న ఖాళీ స్థలంలో గార్డెన్‌ను ఏర్పాటు చేసి శతాబ్ది ఉత్సవాల పైలాన్ నిర్మాణం పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్ట్స్ కాలేజీ భవనం మరమ్మతు పనులను కూడా త్వరలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచాలి


హస్తినాపురంలో సంతకాలను సేకరిస్తున్న యాదగిరి

హస్తినాపురం: విద్య, ఉద్యోగావకాశాలతో పాటు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లను పెంచి వాటిని పటిష్టంగా అమలు చేయాలని బీఎస్పీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ జక్కా యాదగిరి డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్‌లు పెంచాలని కోరుతూ ఎల్‌బీనగర్ శాఖ ఆధ్వర్యంలో హస్తినాపురం డివిజన్ పద్మావతి కాలనీ, షిరిడీ సాయి నగర్, సంతోషిమాతా కాలనీ, డీఆర్‌డీఏ కాలనీ తదితర ప్రాంతాలలో ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీల కులగణన చేపట్టాలని , కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించి వాటిని ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. అయినా ఆదిశగా చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు సంపత్, కట్టకుమార్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి కిడ్నాప్‌నకు విఫలయత్నం

- ఆర్థిక లావాదేవీలే కారణం
- ఆందోల్ సమీపంలో కిడ్నాపర్ల అరెస్టు

చైతన్యపురి: డబ్బు లావాదేవీల కారణంగా ఓవ్యక్తిని కిడ్నాప్ చేసిన ముఠాను సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు సమాచారం మేరకు... తపోవన్‌కాలనీలోని వైఎస్ఆర్ గార్డెన్ పార్కింగ్ స్థలంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తిని కొందరు కారులో బలవంతంగా ఎక్కించుకుని వెళుతుండగా ఆ వ్యక్తి రక్షించండి అంటూ కేకలు వేశాడు. ఇది గమనించిన గార్డెన్ పార్కింగ్ యార్డ్ సూపర్‌వైజర్ ఆనంద్ కారు వెంట కొంతదూరం పరిగెత్తాడు. అయినా ప్రయోజనం లేక పోవటంతో సరూర్‌నగర్ పోలీసులకు ఆనంద్ సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సంగారెడ్డి వైపు కారు వెళ్లినట్లు గుర్తించి ఎస్ఐ తమ సిబ్బందితో వెంబడించాడు. ఆందోల్ సమీపంలోని సంగుపేట వద్ద కారును అడ్డగించారు. కిడ్నాప్‌కు గురైన తరాల వెంకటేష్(37)ను కాపాడారు. ఉప్పుగూడకు చెందిన కారు డ్రైవర్ అయిన వెంకటేష్‌కు సంగారెడ్డి జిల్లా మూనూరు మండల్‌కు చెందిన బేగరి నవీన్‌కుమార్(29)ల మధ్య డబ్బు లావాదేవీల్లో వివాదం ఉందని ఈ క్రమంలోనే కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. కిడ్నాప్‌లో నవీన్‌కుమార్‌కు సహకరించిన మేగావత్ ప్రవీణ్‌కుమార్(31), నేనావత్ అజయ్‌నాయక్(19), కర్రా సంజీవ్(36), కర్రా విజయ్(32)లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. నిందితులపై కేసు నమోదు శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చైతన్యపురి: నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతారాం సమాచారం మేరకు... పోచమ్మబాగ్ కాలనీలో చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శనివారం సోదాలు చేశారు. జోరీగల శ్రీనివాస్ అనే వ్యక్తి జమాల్‌పూర్ శ్రీనుతో కలిసి చైనా మాంజా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడితోపాటు ఆల్ అవుట్ బిగ్ చైనా మాంజా చరాక్‌లు అయిదు, మోనో కట్టర్ థౌజండ్ చైనా మాంజా చరాక్‌లు 35, డ్రాగన్ థౌజండ్ చైనా మాంజా చరాక్‌లు 11, డ్రాగన్ 500 చైనా మాంజా చరాక్‌లు ఆరు, పది లూజ్ చైనా మాంజా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఇన్‌స్పెక్టర్ సితారాం వివరించారు.